గజానికో గుంత..!



రాణిగాం -ఎర్రముక్కాం రహదారి

- అధ్వానంగా రాణిగాం – ఎర్రముక్కాం రహదారి
- వాహనాల రాకపోకలకు ఇబ్బందులు
- అవస్థలు పడుతున్న మత్స్యకార విద్యార్థులు

సోంపేట:

మండలంలోని రాణిగ్రాం గ్రామం నుంచి ఎర్రముక్కాం వెళ్లే నాలుగు కిలోమీటర్ల రహదారిలో ప్రతీ 100 మీటర్ల దూరానికి కనీసం ఒక గుంత ఉంటుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. ఎర్రముక్కాం గ్రామం నుంచి పాత జాతీయ రహదారికి చేరుకోవాలంటే రోడ్డు అధ్వానంగా ఉండడంతో ప్రమాదాలబారిన పడుతున్నామని ఆందోళన చెందుతున్నారు. నిత్యం పాఠశాలలు, కళాశాలకు వెళ్లే మత్స్యకార విద్యార్థులు, చిన్న వ్యాపారులు, ఆటో డ్రైవర్లు ఆపసోపాలు పడుతున్నారు. గోతుల రోడ్డు కావడంతో వాహనాల మన్నిక తగ్గి రిపేర్లు చేసుకోవడానికే ఆదాయం సరిపోతోందని వాహనదారులు చెబుతున్నారు. ప్రమాదాలు, పురిటి నొప్పుల సమయాల్లో కనీసం అంబులెన్స్‌లు కూడా సమయానికి గ్రామాలకు రాలేని పరిస్థితులు ఉన్నాయని వాపోతున్నారు. సోంపేట, మందస మండలాల పరిధిలో 16 గ్రామాలకు అవసరమైన రహదారులు మరమ్మతులకు నోచుకోలేదు. ప్రజాప్రతినిధులు, అధికారులకు వినతిపత్రాలు ఇవ్వడం మినహా ప్రయోజనం చేకూరడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. అందువలన ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రహదారి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కరించాలి



రహదారి పూర్తిగా గోతులమయం కావడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మత్స్యకార గ్రామాలను దృష్టిలో ఉంచుకుని సమస్య పరిష్కరించాలి. సోంపేట, మందస పరిధిలోని గ్రామాల ప్రజలకు మేలు జరిగేలా చర్యలు తీసుకోవాలి.

– దామోదర్‌రావు, విద్యావేత్త, ఎర్రముక్కాం

వెన్నెముక సమస్యలు వస్తాయి



గుంతల రహదారిలో నిత్యం ప్రయాణం చేయడం వలన అనారోగ్య సమస్యలు వస్తాయి. ముఖ్యంగా వెన్నెముక సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది. వాహనదారులకు తీవ్ర అసౌకర్యం ఏర్పడి వాహనాలు దెబ్బతింటున్నాయి. ప్రజల ఇబ్బందులు దృష్టిలో ఉంచుకుని రహదారి సమస్య పరిష్కరించాలి.

–బైపల్లి బాబురావు, ఉపాధ్యాయుడు, ఎర్రముక్కాం

క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

టెక్కలి: మండల పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ జి.శంకరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. టెక్కలి టౌన్–1 ఫీడర్‌తో పాటు కె.కొత్తూరు, రావివలస సబ్‌స్టేషన్, లింగాలవలస, తలగాం, టెక్కలి టౌన్–5 పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని వెల్లడించారు.

భూవివాదంపై న్యాయం చేయాలి

టెక్కలి: తన భూ వివాదంపై న్యాయం చేయాలని కోటబొమ్మాళి మండలం జియ్యన్నపేట గ్రామానికి చెందిన బోకర మోహన్‌రావు టెక్కలి తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా చేశారు. టెక్కలి మండలం చింతలగార గ్రామం రెవెన్యూ పరిధిలో తాను కొనుగోలు చేసిన భూమిని కొంతమంది కబ్జా చేయాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై న్యాయం చేయాలని కోరుతూ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయనతో పాటు దళిత సంఘాల నాయకుడు వై.గోపి తదితరులు ఉన్నారు.

పారిశుద్ధ్యంపై అవగాహన



పారిశుద్ధ్యంపై కరపత్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని హరిపురం గ్రామ పంచాయతీలో డిప్యూటీ ఎంపీడీవో ఎస్.కృష్ణ పారిశుద్ధ్యంపై గ్రామ ప్రజలకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇంటింటా చెత్త సేకరణ, ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ల పనితీరును వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సర్వేశ్వరరావు, మహిళా పోలీసు భారతి రౌళో, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామస్తుల సహకారం అవసరం



పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న దృశ్యం

నందిగాం: పాఠశాలల అభివృద్ధికి గ్రామస్తులు, దాతల సహకారం అవసరమని నర్సిపురం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం చెల్లి వెంకటరమణ అన్నారు. పాఠశాల ఆవరణలో నాటేందుకు బావనపాడుకు చెందిన ఏఎస్‌ఐ చమళ్ల చిట్టిబాబు సీహెచ్ గోవిందరాజులు 150 మొక్కలను గురువారం అందజేశారు. ఈ మొక్కలను గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు కలిసి నాటారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బొడ్డేపల్లి శేషగిరి, రమేష్‌కుమార్, అమీన్, దీప తదితరులు పాల్గొన్నారు.

కమనీయం జగన్నాథుని నేత్రోత్సవం



స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

కవిటి: మండల కేంద్రం కవిటి బెహరావీధిలో వెలసిన జగన్నాథస్వామికి గురువారం ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నేత్రోత్సవం వేడుకలు వైభవంగా నిర్వహించారు. దీనిలో భాగంగా వేకువజాము నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారికి దీపాలంకరణ సేవ, భజన కాలక్షేపాలు చేపట్టారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

పరామర్శ



లింగరాజు కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ తదితరులు

సోంపేట: మండలంలోని మామిడిపల్లి పంచాయతీకి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు గోకర్ల లింగరాజు తండ్రి కేశవరావు ఇటీవల మృతి చెందారు. దీంతో వారి కుటుంబాన్ని ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, జెడ్పీటీసీ తడక యశోద గురువారం పరామర్శించి సంతాపం తెలియజేశారు. వారితో పాటు మండల పార్టీ అధ్యక్షుడు శిలగాన భాస్కరరావు, పలాసపురం, మామిడిపల్లి సర్పంచ్‌లు తడక జోగారావు, పాతిన శేషగిరి, ఎంపీటీసీ మాధవరావు, కోట్ని శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు అభినందనలు

పలాస: మండలంలోని రెంటికోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులు చందిన రాజేశ్వరి పాణిగ్రాహి, భరతినాయక్‌లను పాఠశాలలో ఉపాధ్యాయులు గురువారం అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం.నిర్మల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గిరిజనుల అభివృద్ధికి కృషి



గిరిజనులతో మాట్లాడుతున్న అధికారులు

కంచిలి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనుల అభివృద్ధికి కృషి చేస్తున్నాయని ఎంపీడీవో వి.తిరుమలరావు అన్నారు. మండలంలోని నువాగడ గ్రామంలో 12 గిరిజన గ్రామాల్లోని ప్రజలతో గురువారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల స్థాయి అధికారులు మాట్లాడుతూ గిరిజనుల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు గ్రామస్థాయి అధికారులు కృషి చేయాలని సూచించారు. ధర్తిజన భగీరథి అభియాన్‌లో భాగంగా గిరిజనులు ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఇప్పిలి లోలాక్షి, సర్పంచ్ సబితా గౌమాంగో, తహసీల్దార్ రమేష్ కుమార్, ప్రత్యేకాధికారి ఇబ్రహీం, వ్యవసాయాధికారి సురేష్, ఐసీడీఎస్ అధికారి ధనలక్ష్మి, విద్యాశాఖాధికారి చిట్టిబాబు పాల్గొన్నారు.

సకాలంలో సాగునీరు అందిస్తాం



వంశధార ఎడమ కాలువను పరిశీలిస్తున్న ఈఈ శేఖర్ తదితరులు

పలాస: పలాస, వజ్రపుకొత్తూరు మండలాల రైతులకు గతేడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా సకాలంలో సాగునీరు అందిస్తామని వంశధార ఈఈ శేఖర్ తెలియజేశారు. నియోజవర్గంలోని వంశధార ఎడమ కాలువ పూడిక తీత పనులను గురువారం పరిశీలించారు. కాలువలోని పూడికలను తీయిస్తున్నామని, మరో వారం రోజుల్లో ఈ పనులు పూర్తవుతాయన్నారు. అనంతరం ఎడమ కాలువ ద్వారా రెండు మండలాలకు సాగునీరు వస్తుందని వెల్లడించారు. కార్యక్రమంలో జేఈ రాజశేఖరం తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

కాశీబుగ్గ: మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని వాకర్స్ క్లబ్ సభ్యులు అన్నారు. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్నటువంటి ముత్యాలమ్మ కోనేరు (నెహ్రూపార్కు) నందు గురువారం ఉదయం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. వాకర్స్ క్లబ్ కార్యదర్శి దడియాల నరసింహులు ఆధ్వర్యంలో మొక్కలు నాటి వాటికి రక్షణ కవచాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆ సంఘ అధ్యక్షుడు పండిత రాజేంద్ర, ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ పైల జవహర్, బల్ల రాంబాబు, లండ నాగరాజు, రాము, బందారి బుజ్జి, శిష్టు వసంతు, వాసు, సంతోష్‌పాత్రో, వెంగల సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల నిరసన



నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

కాశీబుగ్గ: తమకు పనికి తగిన పనిముట్లు ఇవ్వాలని, పీఎఫ్ డబ్బులు ఖాతాల్లో జమ చేయాలని మున్సిపల్ కార్మికులు గురువారం నిరసన చేపట్టారు. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులంతా పారిశుద్ధ్య పనులను ఆపివేసి, కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద పాత సామాన్లు ప్రదర్శించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మరణించిన, రిటైర్ అయినటువంటి కార్మికుల కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇప్పించాలని కోరారు. ఈ విషయంపై ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో నిరసన తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘ అధ్యక్షుడు సీహెచ్ మురగన్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నెయ్యిల గణపతి, కె.వెంకట్, బి.కూర్మారావు, రవికుమార్, ఈశ్వరరావు, బాలకృష్ణ,రమేష్, తిరుపతి, ప్రకాష్, ఢిల్లీ, అమర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మత్తుతో జీవితాలు చిత్తు

మాదక ద్రవ్యాలకు యువత, విద్యార్థులు దూరంగా ఉండాలని వక్తలు సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. మాదక ద్రవ్యాలతోపాటు గంజాయి వంటి మత్తు పదార్థాలు కలిగి ఉన్నా, సేవించినా కఠిన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. అనంతరం అవగాహన ర్యాలీలు చేపట్టారు. ప్రజాప్రతినిధులు, ఎక్సైజ్, పోలీసులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్



టెక్కలి: ఆర్డీవో కృష్ణమూర్తి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ



వజ్రపుకొత్తూరు రూరల్: మాట్లాడుతున్న మెరైన్ సీఐ రాము



సోంపేట: విద్యార్థులతో మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ జీవీ రమణ



ఇచ్ఛాపురం రూరల్: మాదక ద్రవ్యాలపై ప్రతిజ్ఞ చేస్తున్న వైస్ ఎంపీపీ గురుమూర్తి, యువకులు



ఇచ్ఛాపురం: పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



వజ్రపుకొత్తూరు: పూండిలో అవగాహన ర్యాలీ



కాశీబుగ్గ: పలాస కోర్టు ముందు ర్యాలీలో పాల్గొన్న జడ్జి మాధురి తదితరులు



మందస: ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, గ్రామస్తులు



టెక్కలి: టెక్కలిలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

వేధిస్తున్న లో ఓల్టేజీ సమస్య..!

- అవస్థలు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



లో ఓల్టేజీ సమస్య ఉన్నటువంటి ఎన్టీఆర్ కాలనీ

టెక్కలి: డివిజన్ కేంద్రమైన టెక్కలిలో లో ఓల్టేజీ సమస్యలు వేధిస్తున్నాయి. ఒకవైపు వినియోగదారులకు విద్యుత్ బిల్లుల మోత మోగుతున్నా.. సక్రమంగా విద్యుత్ అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని సందర్భాల్లో లో ఓల్టేజీ, హై ఓల్టేజీ సమస్యలతో ఇళ్లల్లో గృహోపకరణాలు పాడైపోయి ఆర్థిక భారాన్ని తెచ్చిపెడుతున్నాయి. వీటికి తోడు క్షేత్రస్థాయిలో లైన్‌మెన్ల కొరత ఉండడంతో అత్యవసర సమయాల్లో వినియోగదారులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. 2024–25 సంవత్సరంలో స్తంభాల మార్పిడి, ట్రాన్స్‌ఫార్మర్లు, కండక్టర్లు, ఏబీ స్విచ్‌ల కోసం సుమారు రూ.4.35 కోట్ల మేరకు ప్రతిపాదనలు, మంజూరుతో పాటు కొంత మేరకు పనులు చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు. కానీ నిత్యం విద్యుత్ సమస్యలు వస్తుండడంతో ప్రజలు అసహనానికి గురవుతున్నారు. ప్రధానంగా ఎన్టీఆర్ కాలనీ, ఆదిఆంధ్రా వీధి, కొప్పల అప్పన్న నగర్, తొలుసూరుపల్లి రోడ్డు, శంభానవీధి, సోగ్గాడిపేట, అక్కపువీధి తదితర ప్రాంతాల్లో నిత్యం లో ఓల్టేజీ సమస్యలు వేధిస్తున్నాయి. అంతేకాకుండా పట్టణంలోని 5 గ్రామ సచివాలయాలకు ఒకే ఒక్క లైన్‌మెన్ ఉండడం గమనార్హం.

టెక్కలి నియోజకవర్గంలో విద్యుత్ సర్వీసులు

టెక్కలితో పాటు కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, నందిగాం తదితర మండలాల్లోనూ విద్యుత్ సమస్యలు వేధిస్తున్నాయి. నియోజకవర్గంలో విద్యుత్ సర్వీసులు ఒక్కసారి పరిశీలిస్తే..

మండలం	మొత్తం సర్వీసులు
టెక్కలి	33,169
నందిగాం	17,757
కోటబొమ్మాళి	26,075
సంతబొమ్మాళి	23,070

అధికంగా బిల్లులు వేస్తున్నారు

వినియోగదారులపై అధికంగా కరెంట్ బిల్లులు వేస్తున్నారు తప్ప, సక్రమంగా కరెంట్ ఇవ్వడం లేదు. మా ప్రాంతంలో చాలా రోజుల నుంచి లో ఓల్టేజీ సమస్య ఉంది. దీంతో రాత్రి వేళల్లో చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఇటీవల అధికారులకు విన్నవించాం. అయినా సమస్య పరిష్కారం కావడం లేదు.

– వై.వెంకట్రావు, ఆదిఆంధ్రావీధి, టెక్కలి

ప్రతిపాదనలు చేశాం



టెక్కలితో పాటు మరికొన్ని ప్రాంతాల్లో లో ఓల్టేజీ సమస్య పరిష్కారం కోసం ఇప్పటికే ప్రతిపాదనలు చేసి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. అలాగే మరికొన్ని విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తున్నాం.

– జి.శంకర్రావు, ఈఈ, విద్యుత్ శాఖ, టెక్కలి



ఆదిఆంధ్రావీధి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

ప్రమోషన్లు కల్పించి బదిలీలు చేపట్టాలి

వజ్రపుకొత్తూరు: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు ప్రమోషన్లు కల్పించి అనంతరం బదిలీలు చేపట్టాలని, సొంత మండలాల్లోనే పోస్టింగ్‌లకు అవకాశం కల్పించాలని గ్రామ సచివాలయ ఉద్యోగులు కోరారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం ఆందోళన చేపట్టారు. రెండు నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, జీవో నంబర్ 5ను సవరించాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. అనంతరం ఎంపీడీవో ఎన్.రమేష్‌నాయుడుని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ ఉద్యోగులు షేక్ బాబుద్దీన్, సీహెచ్ హరీష్, పి.భువనేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మందస: మండలంలోని గ్రామ సచివాలయ ఉద్యోగులు స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం నిరసనలు తెలిపారు. స్పష్టమైన జాబ్ చార్ట్ ఇచ్చి సర్వీస్ రూల్స్ అమలు చేసిన తర్వాత మాత్రమే టాన్స్‌ఫర్ ప్రక్రియ చేపట్టాలని కోరారు. రేషనలైజేషన్ రద్దు చేయాలని విన్నవించారు.

నందిగాం: గ్రామ, వార్డు సచివాలయాల అన్ని శాఖల ఉద్యోగులకు సర్వీస్ రూల్స్ అమలు చేసిన తర్వాతే బదిలీల ప్రక్రియ చేట్టాలని ఉద్యోగులు కోరారు. ఎంపీడీవో కుమార్ పట్నాయక్, తహసీల్దార్ సోమేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. మిగులు సిబ్బందిని ఎలా వినియోగించుకుంటారో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు.



నందిగాం: ఎంపీడీవో కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు



మందస: మండల పరిషత్ కార్యాలయం వద్ద నిరసన



వజ్రపుకొత్తూరు: ఆందోళన చేపడుతున్న సచివాలయ ఉద్యోగులు